

0.7 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో గురువారం సాయంత్రం సమయానికి 0.719 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



పోలీసు శాఖలో బదిలీలు

పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ప్రతిపాదనల మేరకు 13 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో▸



అర్హులందరికీ 'సంక్షేమం'

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోంది. ఈ కోవలో అర్హత ఉండి వివిధ పథకాలు రాని వారికి శుక్రవారం ప్రభుత్వం నిధులు విడుదల చేయనుంది. 8లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి విధులకు న్యాయవాదులు

కర్నూలు(లీగల్): రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నూతన భూహక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు గడిచిన 24 రోజులుగా కోర్టు విధులను బహిష్కరించి రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. భూహక్కు చట్టంపై రాష్ట్ర హైకోర్టులో బార్ అసోసియేషన్ తరఫున రిట్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ చేపట్టిన కోర్టు స్టే మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి విధులకు హాజరుకావాలని గురువారం జరిగిన అత్యవసర సమావేశంలో తీర్మానం చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చక్రపాణి తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ తుది కీ విడుదల

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష తుది కీని విడుదల చేసినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 3వ తేదీన జిల్లాలోని 17 కేంద్రాలలో పరీక్ష నిర్వహించగా 3,773 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో కీ అందుబాటులో ఉందని, పరీక్ష రాసిన వారు చూసుకోవచ్చని తెలిపారు.

బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి

- ఈ నెల 4వ వారంలో 16 విడత పీఎం కిసాన్

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేక మంది రైతులు ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ కోసం బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో 2,136 మంది, నంద్యాల జిల్లాలో 1,396 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ నెంబర్ లింక్ కాలేదు. ఈ నెల 4వ వారంలో 16వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదల కానున్నారు. సంబంధిత రైతులు ఈ నెల 10లోపు బ్యాంకు బ్రాంచీలకు ఆధార్ కార్డు తీసుకెళ్లి ఖాతాలకు అనుసంధానం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. కాగా కర్నూలు జిల్లాలో 1,006 మంది రైతులు, నంద్యాల జిల్లాలో 1,470 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈకేవైసీ కూడా ఈ నెల 10లోపు చేయించుకోవాలని సూచించారు. ఈ జాబితాలను సంబంధిత ఆర్‌బీకేలకు చేరవేశారు.

లా పరీక్ష ఫలితాల విడుదల

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని లా కాలేజీల్లో 3, 5 సంవత్సరాల కోర్సులకు సంబంధించి అక్టోబర్‌లో నిర్వహించిన రెగ్యులర్, సప్లిమెంటరీ, రీవ్యాల్యుయేషన్‌కు సంబంధించిన పరీక్ష ఫలితాలను వర్సిటీ వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ ఫజులుర్ రహిమాన్ విడుదల చేశారు. రెగ్యులర్ పరీక్షలకు సంబంధించి మొత్తం 821మందికిగాను 709 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మొత్తం 261 మందికిగాను 160 మంది, రీవాల్యుయేషన్‌కు సంబంధించి 40 మందికిగాను 16 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు వర్సిటీ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

అగ్రిగోల్డ్ బాండ్లు తీసుకెళ్లండి

కర్నూలు (లీగల్): లోపాలున్న అగ్రిగోల్డ్ బాండ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఈనెల 8న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాపసు తీసుకునేందుకు అవకాశం కల్పించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల ప్రజలు తమ రసీదులను తీసుకు వచ్చి ఒరిజినల్ బాండ్లను వాపసు తీసుకెళ్లాలన్నారు.



కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన సామాజిక సాధికార బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు



సీఎం జగన్ ఫ్లెక్సీలతో అభిమానుల సందడి

సామాజిక ప్రభంజనం

- కల్లూరులో సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- జనంతో పోటెత్తిన చెన్నమ్మ సర్కిల్
- రెపరెపలాడిన వైఎస్సార్‌సీపీ జెండాలు
- కళకళలాడిన సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీలు
- కేఎస్‌ఆర్ కన్వెన్షన్ నుంచి ఉత్సాహంగా సాగిన ర్యాలీ
- హాజరైన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

వైఎస్సార్‌సీపీ పాలనలో సాధికారతకు ప్రజలు జై కొట్టారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీగా తరలివచ్చారు. ప్రజాప్రతినిధులకు జేజేలు పలికారు. గురువారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభను ఈలలు, కేకలతో ఉర్రూతలూగించారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న సమయంలో సానుకూలతను వ్యక్తం చేశారు. బహిరంగ సభకు మహిళలు సైతం భారీ సంఖ్యలో తరలి వచ్చి మద్దతు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి తామంతా అండగా ఉన్నామని చాటి చెప్పారు.

కర్నూలు(అర్బన్): పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరులో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి అనూహ్య రీతిలో పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టుకుని కదంతొక్కారు. నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాలతోపాటు కర్నూలు నగరం కల్లూరు పరిధిలోని 16 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బస్సు యాత్రకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కర్నూలు, హిందూపురం, తిరుపతి ఎంపీలు డాక్టర్ ఎస్ సంజీవ్‌కుమార్, గోరంట్ల మాధవ్, గురుమూర్తి, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, డాక్టర్ జరదొడ్డి సుధాకర్, నగర మేయర్ బీవై రామయ్య హాజరయ్యారు. కేఎస్‌ఆర్ కన్వెన్షన్ నుంచి మోటారు సైకిల్ ర్యాలీ ప్రారంభమై.. కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్ వరకు సాగింది. దారి పొడవునా వైఎస్సార్‌సీపీ జెండాలు, సీఎం జగన్ ఫ్లెక్సీలు కళకళలాడాయి. బస్సు యాత్రకు ఊహించని రీతిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నేతల ప్రసంగాల సమయంలో సభకు హాజరైన ప్రజలు ఈలలు, కేకల ద్వారా తమ ప్రతిస్పందనను తెలియజేశారు. పురుషులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి ఆకర్షణగా నిలిచారు. వేదిక మీదకు ఆయన రాగానే పెద్ద సంఖ్యలో జనం ఈలలు, కేకలతో హోరెత్తించారు. ఆయన ప్రసంగంలో కూడా స్పష్టత కనిపించింది.



బైక్ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

మారుతున్న పేదల తలరాతలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల తలరాతలు మారుతున్నాయి. కులం, మతం, పార్టీ అనే భేదం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించడమంటే చిన్న విషయం కాదు. చంద్రబాబుకు సొంతంగా పార్టీ పెడితే కష్టసుఖాలు తెలిసేవి. మొదటి కాంగ్రెస్‌లో ఉండి, అనంతరం మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీని లాక్కున్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క బీసీనైనా రాజ్యసభకు పంపారా? దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ప్రత్యేకంగా 64 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. అబద్ధాలు రాస్తూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్న 'ఈనాడు, ఆంధ్రజ్యోతి ' పేపర్లను చదవొద్దు. పేదలు బాగు పడడం వారికి కడుపు మంట.
– నారాయణస్వామి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

ఒక్క సారి బటన్ నొక్కండి

రాష్ట్రంలో 80 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎవ్వరూ ఊహించని రీతిలో ఆయా వర్గాలకు అనేక పదవులు కట్టబెట్టారు. ఆయన రుణం తీర్చుకోవాల్సిన సమయం వచ్చింది. సంక్షేమ పథకాల ద్వారా కోట్ల రూపాయలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసేందుకు ప్రతి ఏడాది అనేక సార్లు బటన్ నొక్కుతున్న జగనన్న కోసం రానున్న ఎన్నికల్లో ఒక్క సారి బటన్ నొక్కాలి.
–డాక్టర్ ఎస్. సంజీవ్‌కుమార్, కర్నూలు ఎంపీ

జగన్‌తోనే సామాజిక విప్లవం

రాష్ట్రంలో సామాజిక విప్లవం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైంది. బడుగు, బలహీన వర్గాల వారికి ఎంతో మేలు జరిగింది. రానున్న ఎన్నికల్లో తోడేళ్లన్నీ జట్టుకట్టి వస్తున్నాయి. కానీ సింహం సింగిల్‌గానే రంగంలోకి దిగుతోంది. వంద ఎలుకలు తిన్న పిల్లి నేను శాకాహారిని అంటే ఎవరైనా నమ్ముతారా? అలా ఉంది చంద్రబాబు పరిస్థితి. ఆయన హైదరాబాద్‌లో కూర్చొని ఏపీలో రాజకీయం చేస్తున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ పార్టీ కంటే బర్రెలక్కకు ఎక్కువ ఓట్లు వచ్చాయి.
– బీవై రామయ్య, కర్నూలు నగర మేయర్

పాణ్యం ప్రజలకు రుణపడి ఉంటా

నన్ను ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఆదరించిన పాణ్యం నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటా. నమ్మిన ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎందాకైనా వెళ్తా. రూ.27 వేల కోట్లతో గ్రీన్‌కో ప్రాజెక్టు తీసుకువచ్చాం. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.600 కోట్లతో గుట్టపాడు వద్ద జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమ పనులు జరుగుతున్నాయి. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో నాలుగు సంవత్సరాల్లో రూ.800 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. రూ.60 కోట్ల డీఎంఎఫ్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేశాం. పార్లమెంట్ సభ్యుల అభివృద్ధి నిధుల ద్వారా కూడా పనులను చేట్టాం. గోరుకల్లు రిజర్వాయర్‌లో నేటికీ 11 టీఎంసీల నీరు నిల్వ ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. కర్నూలులో నేను కానీ నా కుటుంబ సభ్యులెవరైనా కబ్జాలకు పాల్పడినట్లు రుజువు చేస్తే వారికే వాటిని అందిస్తా. నా 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించలేదు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి. పేదలను ఆదుకోవాలని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలో ఉన్న తపనే ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలోనూ ఉంది.
– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే

నమ్మకానికి ప్రతిరూపం సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకానికి ప్రతిరూపంగా నిలిచారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో పేదల కష్టాలు చూసి అధికారంలోకి రాగానే చెప్పినవి, చెప్పనవి కూడా అనేక పథకాలు అమలు చేస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఎంతో చేరువైన ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది.
– జరదొడ్డి సుధాకర్, కోడుమూరు ఎమ్మెల్యే

జగన్ యాత్ర ప్రారంభమైతే తట్టుకోలేరు

ఇప్పటికే లోకేష్‌బాబు, పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఎన్నికల యాత్రలను ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా యాత్ర ప్రారంభించలేదు. యాత్ర ప్రారంభిస్తే తట్టుకోలేరు. జగన్ సునామీ ముందు అందరూ కొట్టుకుపోవాల్సిందే. నాలుగున్నరేళ్ల పాలనలో సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అనేక సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడి ఇంటి ముంగిటికి తీసుకువచ్చారు. పేదల తలరాతలు మారుస్తున్న మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. – హఫీజ్‌ఖాన్, కర్నూలు ఎమ్మెల్యే



బస్సు యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు



బహిరంగ సభకు నడుచుకుంటూ వస్తున్న ఎంపీలు సంజీవ్‌కుమార్, గురుమూర్తి, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య తదితరులు

'చీర'స్మరణీయ గుర్తింపు

- కోడుమూరు పట్టు చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు
- ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద అందిన కాంస్య పతకం
- ఢిల్లీలో అవార్డు అందుకున్న చేనేత, జౌళిశాఖ ఏడీ హరికృష్ణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో కోడుమూరు కేంద్రంగా ఉత్పత్తి అవుతున్న చేనేత పట్టు చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్రంలో చేనేత చీరలకు సంబంధించి ఐదు జిల్లాలకు జాతీయస్థాయి పురస్కారాలు లభించాయి. ఇందులో కర్నూలు జిల్లా ఒకటి కావడం విశేషం. జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన తరఫున జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ జాతీయ స్థాయిలో కాంస్య పతకాన్ని అందుకున్నారు. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి కింద అపురూపమైన చేతివృత్తులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో అవార్డులు ప్రకటించింది. జాతీయ స్థాయి అవార్డు కోసం కర్నూలు జిల్లాకు సంబంధించి చేనేత పట్టుచీరలు, నంద్యాల జిల్లాకు సంబంధించి ఆళ్లగడ్డ రాతి చిత్రాలను పంపారు. ఆళ్లగడ్డ రాతి చిత్రాలు గుర్తింపు లభించకపోగా.. కోడుమూరు పట్టుచీరలకు జాతీయ స్థాయి అవార్డు వచ్చింది.

జిల్లాలో ఏటా రూ.100 కోట్ల విలువైన పట్టుచీరల ఉత్పత్తి

జిల్లాలోని కోడుమూరు కేంద్రంగా ఆదోని, ఎమ్మిగనూరు, కృష్ణగిరి, నందవరం తదితర మండలాల్లో చేనేత మగ్గాలపై పట్టు చీరలు ఉత్పత్తి అవుతున్నాయి. జిల్లా చేనేత జౌళిశాఖ అధికారులు లెక్కల ప్రకారం 2,200 మంది చేనేత కార్మికులు పట్టుచీరలు తయారు చేస్తున్నారు. ఒక్కక్కరు సగటున వారానికి రెండు ప్రకారం నెలకు 17,600 చీరలు ఉత్పత్తి చేస్తున్నారు. చీర సగటు విలువ రూ.5 వేలు ప్రకారం లెక్కించినా.. వీటి విలువ రూ.8.80 కోట్లు ఉంటుంది. ఈ ప్రకారం ఏడాదికి రూ.100 కోట్లకుపైగా విలువ చేసే పట్టుచీరలు ఉత్పత్తి చేస్తున్నారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వాటిని గద్వాల పట్టుచీరల పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారు. తాజాగా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంతో కోడుమూరు పట్టుచీరల పేరుతో ప్రమోట్ చేసుకునే అవకాశం ఏర్పడింది. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కోడుమూరు పట్టుచీరలకు విదేశాల్లో డిమాండ్ ఉంది. ప్రవాసాంధ్రులు, ప్రవాస భారతీయ మహిళలు వీటిపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. జాతీయ స్థాయి అవార్డు లభించడంతో చేనేత పట్టుచీరలు మరోసారి మహిళలను ఆకర్షించే అవకాశం ఏర్పడింది.



కర్నూలు జిల్లాలో తయారు చేసిన చేనేత పట్టు చీర

అధికారులకు సీఎస్ అభినందన

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు పట్టుచీరలకు జాతీయ స్థాయిలో కాంస్య పతకం రావడం గర్వకారణమని, ఇందుకోసం కృషి చేసిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఇతర అధికారులను అభినందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధులకు దూరంగా ఉండడంతో వారి స్థానంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా సేవలు అందించాలని ఆదేశించారు. జల జీవన్ కింద జరుగుతున్న ఇంటింటికీ కుళాయి పనులను మార్చిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పర్యటించే అవకాశం ఉందని, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదన్ రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ హిమ ప్రభాకరరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

9లోపు మెడికల్ బిల్లుల వివరాలు అందించాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ దగ్గర పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లుల వివరాలు ఈ నెల 9వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని డీఈఓ డాక్టర్ వి. రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న 57 బిల్లుల ప్రతిపాదనల వివరాలను ఆయా అధికారులకు మెయిల్ ద్వారా పంపించామని డీఈఓ పేర్కొన్నారు.

డీవీఎంసీ మెంబర్‌గా గద్ద రాజశేఖర్



కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) మెంబర్‌గా కర్నూలుకు చెందిన గద్ద రాజశేఖర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ డా.జీ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ఇప్పటి వరకు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. తన సేవలను గుర్తించి డీవీఎంసీ మెంబర్‌గా నియమించారన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

యువతిపై అత్యాచారయత్నం

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో గురువారం ఉదయం ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన కురువ సుంకన్న (55) అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. యువతి ఉదయం బహిర్భూమికి వెళ్లగా ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. యువతి కేకలు వేయడం, ఇరుగు పొరుగు వారు రావడంతో సుంకన్న పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. యువతిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ ఆదికేశవరాజు తెలిపారు.

భారీగా మద్యం స్వాధీనం

డోన్ రూరల్: పట్టణంలో పాతపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ, కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ భీమలింగడు గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పాతపేటకు చెందిన ఫరీద్, చిన్న ఓ కారులో దాదాపు రూ. 1.50 లక్షల విలువైన తెలంగాణ మద్యం 386 బాటిల్స్, కర్ణాటక మద్యం 96 టెట్రా ప్యాకెట్లు దాచినట్లు సమాచారం అందడంతో సెబ్ పోలీసులు తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కారు, మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. అలాగే ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో ఈశ్వరమ్మ నాటు సారా విక్రయిస్తుండగా 200 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా సరఫరా చేస్తున్న అలేబాద్‌తండాకు చెందిన ముడమత్ గోపాల్ నాయక్‌పై కేసు నమోదు చేశారు. మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ దాడులలో ఎస్ఐ నరసింహారెడ్డి, హెచ్‌సీ సుధాకర్ రెడ్డి, పీసీలు ఉమాకాంత్‌రెడ్డి, చిన్నిక్రిష్ణ, జయచంద్ర, రామక్రిష్ణలు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

జిల్లా అభివృద్ధికి మరింత కృషి

- జిల్లా పరిషత్ ప్రతిష్టను పెంచేందుకు కార్యాచరణ
- రూ.211.44 కోట్లతో పలు పనులకు పరిపాలనా ఆమోదం
- రూ.830 కోట్లతో ఇంటింటికీ కుళాయి
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ.1.56 కోట్లు విడుదల
- రెండేళ్ల పాలనపై జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో జెడ్పీ అధికారులు

కర్నూలు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు పురంకితమవుతామని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. తాను జెడ్పీ చైర్మన్ అయ్యేందుకు రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జెడ్పీటీసీలు ఎంతో సహకారం అందించారన్నారు. అందరి సహకారం, సమష్టి కృషితో జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు చర్యలు చేపడుతామన్నారు. జిల్లా పరిషత్ కీర్తి ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు. జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా గురువారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు.

రూ.830 కోట్లతో ఇంటింటికీ కుళాయి

జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.830 కోట్ల వ్యయంతో ఇంటింటికీ కుళాయి పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జెడ్పీ చైర్మన్ చెప్పారు. రెండు జిల్లాలకు చెందిన ఇంజినీర్లతో మాట్లాడుతూ టెండర్లు పూర్తి అయిన ప్రాంతాల్లో పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నా ...రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేటికీ పలు రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉందన్నారు. ముఖ్యంగా 77 చెరువులకు నీటిని విడుదల చేయడం వల్ల జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తప్పాయన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందన్నారు.

రూ.211.44 కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం

2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.211.44 కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టేందుకు పరిపాలనా ఆమోదం తెలిపినట్లు జెడ్పీ చైర్మన్ తెలిపారు. అలాగే రెండేళ్లలో రూ.2,67,63,790లతో 91 పనులు చేపట్టగా ఇప్పటి వరకు 53 పనులు పూర్తయ్యాయన్నారు. జెడ్పీ సాధారణ నిధులు రూ.15.47 కోట్లలో 378 పనులు చేపట్టగా, రూ.9.78 కోట్ల వ్యయంతో 242 పనులు పూర్తి కాగా, రూ.5.36 కోట్ల విలువైన 136 పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వివరించారు. ఎస్సీ సంక్షేమానికి రూ.1,11,62,449, గిరిజన సంక్షేమానికి రూ.44,64,986 నిధులను జెడ్పీ వాటాగా ఆయా కార్పొరేషన్లకు విడుదల చేశామన్నారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు రూ.3.09 కోట్లతో 107 పనులను చేపట్టగా, 59 పనులు పూర్తయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. 27 మంది నాన్ ప్రావిన్షియలైజ్డ్ సిబ్బందికి జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.1.11 కోట్లు అందించామన్నారు.

కారుణ్య నియామకాల కింద ఇద్దరికి ఉద్యోగాలు



కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విజయ్ యాదవ్, మహబూబ్

పంచాయతీ రాజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులు మృతి చెందడంతో వారి కుమారులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ నియామకపత్రాలను అందించారు. టి విజయ్‌యాదవ్‌ను పగిడ్యాల ఎంపీపీ కార్యాలయానికి, కే మహబూబ్‌ను వెలుగోడు ఎంపీపీ కార్యాలయానికి టైపిస్టులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కేక్ కట్ చేసి సంబరాలు

రెండేళ్ల పాలన పూర్తి అయి మూడో సంవత్సరంలో అడుగు పెడుతున్న నేపథ్యంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, రాంగోపాల్, బసవశేఖర్, సరస్వతమ్మ, పుల్లయ్య, సౌభాగ్యలక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ బ్లాస్టింగ్ చేయటంతో కలుషితమైన దుమ్ము, ధూళి



బ్లాస్టింగ్ భయం

- పోతిరెడ్డి విస్తరణ పనుల్లో నిబంధనలకు తూట్లు
- ఓపెన్ బ్లాస్టింగ్‌తో ప్రజలు బెంబేలు



కలుషితమైన దుమ్ము, ధూళి దాటికి విల విలలాడుతున్న పక్షులు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ చేస్తున్న ఓపెన్ బ్లాస్టింగ్ పనులతో చాబోలు, పోతులపాడు గ్రామాలు దద్దరిల్లుతున్నాయి. వాస్తవానికి కాంట్రాక్టర్లు కంట్రోల్ బ్లాస్టింగ్ పనులు చేయాల్సి ఉండగా యథేచ్ఛగా ఓపెన్ బ్లాస్టింగ్ పనులు చేస్తుండటంతో భారీ శబ్దాలతో భూమికంపిస్తోంది. సమీపంలోని చాబోలు, పోతులపాడు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కాంట్రాక్టర్లు ఓపెన్ బ్లాస్టింగ్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో రాళ్లు ఎగిసిపడటంతో పాటు దుమ్ము, ధూళి భారీగా వ్యాపించి వాతావరణం కలుషితమవుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే బ్లాస్టింగ్‌కు సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. బ్లాస్టింగ్‌కు అవసరమైన యురేనియం, జిలెటిన్‌స్టిక్స్ సరఫరాదారుడికి కూడా అనుమతులు లేనట్లు తెలుస్తోంది. బ్లాస్టింగ్ విషయంపై తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌ను వివరణ కోరగా ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని కంట్రోల్ బ్లాస్టింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని చాబోలు, పోతులపాడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ 'సంక్షేమం'

- 3,089 మందికి రూ.4.78 కోట్ల లబ్ధి
- నేడు బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్న సీఎం జగన్

కర్నూలు(అగ్రికల్చర్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం. 2023-24లో ఇప్పటి వరకు అమలు చేసిన వివిధ పథకాలకు సంబంధించి అర్హత ఉండి రాని వారికి శుక్రవారం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి నిధులను డీబీటీ ద్వారా విడుదల చేయనున్నారు. ఈబీసీ నేస్తం, అమ్మఒడి, జగనన్న చేదోడు, వైఎస్ఆర్ కళ్యాణమస్తు/ వైఎస్సార్ షాదీతోఫా, కాపునేస్తం, వైఎస్ఆర్ నేతన్న నేస్తం, వాహనమిత్ర పథకాల కింద 3,089 మందికి రూ.4,78,86,372 ఆర్థిక ప్రయోజనం లభించనుంది. అత్యధికంగా జగనన్న అమ్మ ఒడి కింద 2,117 మంది తల్లులకు ప్రయోజనం లభిస్తోంది. సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హత ఉండి లబ్ధి చేకూరని వారికి ఏడాదిలో రెండుసార్లు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. 2023-24 లో రెండో దఫా అర్హత ఉన్న వారికి నిధులను విడుదల చేస్తోంది. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. రూ.4.78 కోట్లకు ప్రజాప్రతినిధులతో కలసి జిల్లా కలెక్టర్ సృజన మెగా చెక్ విడుదల చేయనున్నారు.

వివిధ పథకాల కింద లబ్ధి పొందుతున్న వారి వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ప్రయోజనం (రూపాయల్లో)
ఈబీసీ నేస్తం	97	14,55,00
జగనన్న అమ్మవడి	2117	3,01,68,372
జగనన్న చేదోడు	635	63,50,000
వైఎస్ఆర్ కళ్యాణమస్తు/ షాదీతోఫా	91	75,90,000
వైఎస్ఆర్ కాపునేస్తం	8	1,20,000
వైఎస్ఆర్ నేతన్న నేస్తం	17	4,08,000
వైఎస్ఆర్ వాహనమిత్ర	124	17,95,000
మొత్తం	3,089	4,78,86,372



సంక్షేమ బావుటా

స్థలం.. ఇల్లు.. పింఛన్



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పథకాలన్నీ మంజూరవుతున్నాయి. నా భర్త గుర్రప్ప పొలం పనులకెళ్లి 6 నెలల కితం చనిపోయాడు. భర్త ఉండగానే స్థలం, ఇల్లు మంజూరైంది. ఇల్లు కట్టుకుని గృహ ప్రవేశం కూడా చేశాం. నా భర్త చనిపోవడంతో 5 నెలల క్రితం వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పుడు రూ.3 వేల పింఛన్ మంజూరైంది. బుధవారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా పింఛన్ అందుకున్నాను. అన్ని విధాలుగా సాయం చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– చాకలి వెంకటమ్మ, యర్రగుంట్ల, శిరివెళ్ల మండలం

మా కుటుంబానికి అండగా నిలిచారు



సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబం ఎంతో లబ్ధిపొందింది. నాకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు అయ్యాయి. వారసత్వంగా వస్తున్న పాత ఇంటిలోనే అందరూ కలసి ఉండాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి నాకు ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేయించారు. ఇళ్లు మంజూరైంది. ప్రభుత్వం ద్వారా లభించిన రూ.1.80 లక్షలతో పాటు మా వద్ద ఉన్న మరికొంత మొత్తంతో ఇంటిని నిర్మించాం. నా భర్త సుబ్రమణ్యం నాలుగేళ్ల క్రితం మృతి చెందగా నాకు పింఛన్ కూడా మంజూరైంది. సున్నావడ్డీ ద్వారా మరికొంత మొత్తం లభించింది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– విజయమ్మ, ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె మండలం

ఇంతకంటే ఏం కావాలి?



మేం కూలీ పనులు చేసుకుని జీవనం జేస్తున్నాం. మా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలో చదివిస్తున్నాం. మా పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు ఇస్తోంది. షూ, టై, బెల్టు, యూనిఫాం అందజేస్తోంది. మధ్యాహ్నం పూట పాఠశాలలో రుచికరమైన భోజనం పెడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ విద్య అందుతోంది. ఏటా అమ్మఒడి డబ్బులు రూ.15000 ఇస్తున్నారు. వాటితో పిల్లలకు అవసరమైన వాటికి కొనిస్తున్నాం. ప్రైవేట్ బడుల్లో చదివించుకోలేని మాలాంటి వారికి ఇంతకంటే ఏం కావాలి?

– అసీనాబీ, అర్అర్ లేబర్ కాలనీ, ఆదోని

మేలును మరువలేం

హిజ్రాల వైపు వేలు ఎత్తి చూపడమే కాని.. మమ్మల్ని ఆదుకున్న వారు ఎవరూ లేరు. ఎక్కడా పని దొరకని మాకు జీవనం దుర్భంగా ఉండేది. అడుగడుగునా అవహేళనలు ఎదురయ్యేవి. పూట గడవడం కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా కష్టాలను గమనించి.. పింఛన్లు పెంచి అందిస్తోంది. రూ. 3వేలు పింఛన్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆర్థిక కష్టాలు తొలగించిన రాష్ట్ర ప్రభుత్వ మేలును మరువలేం.

– హరి, మధు, ఆలూరు



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన పసుల ప్రసాద్

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై బలపనూరు మెట్టపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండలం పుసులూరు గ్రామానికి చెందిన పసుల ప్రసాద్ (37) తన భార్య పరిమల స్వగ్రామమైన కౌలురు గ్రామానికి క్రిస్మస్ పండుగకు వచ్చారు. మృతుడు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. బుధవారం రాత్రి 11 గంటలకు వాహనానికి డ్రైవర్‌గా రావాలని ట్రావెల్స్ నుంచి ఫోన్ రావడంతో ప్రసాద్ తన బావమరిది చంద్రపాల్ ద్విచక్ర వాహనంపై బలయలుదేరారు. బలపనూరు మెట్ట వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ బైకిస్ట్ వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రసాద్, చంద్రపాల్ తీవ్రంగా గాయపడగా నంద్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే ప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం పాణ్యం పోలీసులు తెలిపారు.

జగన్నాథగట్టులో గ్రావెల్ అక్రమ తరలింపు

- రెండు హిటాచీలు, ఒక టిప్పర్ సీజ్



హిటాచీని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని జగన్నాథ గట్టులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న రెండు హిటాచీలు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసి ఇద్దరి వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. గురువారం జగన్నాథగట్టులో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్నారనే సమాచారంతో మైనింగ్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. గ్రావెల్ తవ్వుతున్న రెండు హిటాచీలు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న దండోర లక్ష్మన్న, వడ్డె శంకర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు 4,800 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తరలించారని తమ విచారణలో తేలిందని రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఖనిజ సంపదను తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు

- ఎన్నికల విధుల కోసం ఉద్యోగుల సమాచారం సేకరణ
- 18 వేల మంది సిబ్బంది అవసరమని అంచనా
- మ్యాన్‌పవర్ కమిటీ ఏర్పాటు



డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే అవకాశం ఉండటంతో ఏర్పాట్లపై జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. వీటితోపాటు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ , కౌంటింగ్ కేంద్రాల్లో పని చేసేందుకు అవసరమైన ఉద్యోగుల వివరాల సేకరించే ప్రయత్నంలో ఉన్నారు. ఇందుకోసం ట్రెజరీస్ డీడీ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో మ్యాన్ పవర్ కమిటీని ఏర్పాటు చేశారు.

ఒకటి, రెండు రోజుల్లో నివేదికకు సిద్ధం

ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండడానికి సమాయత్తం అవుతోంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను నియమించేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే ఉద్యోగుల వివరాలు సేకరణ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్‌పవర్ కమిటీ తన విధులను ప్రారంభించింది. అన్ని శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలు సేకరిస్తోంది. విద్యాశాఖలో పనిచేసే ఉపాధ్యాయులు, ఇతర అధికారులు,, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్, జూనియర్ , సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, వివిధ శాఖల ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేసే ఏఈలు, డీఈలు, ఈఈలు, ఎస్ఈలు డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డీఓలు, సబ్ కలెక్టర్లు, జేసీలు, కలెక్టర్ వరకు ఇలా అన్ని స్థాయిలా అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ఒకటి, రెండు రోజుల్లో దాదాపు 33 శాఖల్లో పనిచేసే అధికారుల వివరాలను నివేదించేందుకు మ్యాన్ పవర్ కమిటీ సిద్ధమవుతోంది.

18 వేల మంది సిబ్బంది అవసరం...

ఎన్నికల విధుల్లో ప్రధానంగా పోలింగ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలతోపాటు ఇతర విధుల్లో పాల్గొనేందుకు జిల్లాకు 18 వేల మంది సిబ్బంది అవసరం అవుతారు. జిల్లాలో 2,186 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రైసెడింగ్ ఆఫీసర్, ఒక అడిషినల్ ప్రైసెడింగ్ ఆఫీసర్, నలుగురు అదర్ ప్రైసెడింగ్ ఆఫీసర్‌లు ఉంటారు. ఈ లెక్కన దాదాపు 13,116 మంది సిబ్బంది అవసరం అవుతారు. అంతేగాక మరో 2 వేల మంది వరకు రిజర్వ్‌లో ఉండేందుకు అవసరం. వీరితోపాటు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ తోపాటు ఇతర విధులకోసం మరో 3 వేల వరకు సిబ్బంది అవసరం అవుతారు. పోలీసులు కాకుండానే జిల్లాలో మొత్తంగా దాదాపు 18 వేల మంది వరకు ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సి ఉంటుంది.

ఇప్పటికే ఎన్నికల విధుల్లో సెక్టోరల్, నోడల్ ఆఫీసర్‌లు

ఇప్పటికే 20 మందిని నోడల్ అధికారులుగా నియమించగా.. వారు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. జిల్లాలో 234 మంది సెక్టోరల్ ఆఫీసర్లను నియమించారు. వీరంతా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీస్తున్నారు. పోలీసులకు సంబంధించి 234 మంది పోలీసు సెక్టోరల్ అధికారులను నియమించారు. వీరు పోలింగ్ కేంద్రాల భద్రత అంశాలపై పరిశీలన చేస్తున్నారు. వీరంతా కూడా ఒకటి, రెండురోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉంది.

> **ఎంపికైన ఉద్యోగులకు శిక్షణ ఇస్తాం**
>
> సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నాం. సిబ్బంది ఎంపిక కోసం మ్యాన్ పవర్ కమిటీని నియమించాం. ఒకటి, రెండు రోజుల్లో నివేదికలు వస్తాయి. ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుని శిక్షణ ఇస్తాం.
>
> –డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

పోలీసు శాఖలో బదిలీలు

13 మంది సీఐలకు స్థానచలనం

- స్టేషన్‌లో ఉన్న 9 మంది వీఆర్‌కు
- వీఆర్‌లో ఉన్న ముగ్గురికి స్టేషన్ల కేటాయింపు

కర్నూలు: పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే అధికారుల బదిలీలు, పోస్టింగులపై కేంద్ర ఎన్నికల సంఘం రెండు రోజుల క్రితం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల చివరి వారంలోగా బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియను పూర్తి చేయాలనే ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లా పోలీసు శాఖలో అధికారుల నుంచి సిబ్బంది వరకు బదిలీల ప్రక్రియపై కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ ప్రతిపాదనల మేరకు ఎస్పీ కృష్ణకాంత్ 13 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లోని స్టేషన్లలో పనిచేస్తున్న 13 మంది వీఆర్‌కు బదిలీ కాగా వీఆర్‌లో ఉన్న ముగ్గురికి స్టేషన్లు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నాలుగు సంవత్సరాల్లో జిల్లాలో మూడు సంవత్సరాలు పూర్తి చేసిన అధికారులను బదిలీ చేయాలనే నిబంధన మేరకు పోలీసు శాఖలో బదిలీలు చేపట్టారు.

బదిలీ అయిన సీఐల జాబితా

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.తేజోమూర్తి	వీఆర్, కర్నూలు	ఆదోని వన్‌టౌన్ పీఎస్
డి.గోపాల్	వీఆర్, కర్నూలు	ఆదోని టూటౌన్ పీఎస్
కె.శ్రీనివాస నాయక్	ఆదోని టూటౌన్ పీఎస్	వీఆర్, కర్నూలు
బి.ఎ.మంజునాథ్	కర్నూలు త్రీటౌన్ (అటాచ్డ్ పీసీఆర్, ఆదోని)	ఆదోని ట్రాఫిక్ పీఎస్
ఎం.పార్థసారథి	ఆదోని ట్రాఫిక్ పీఎస్	వీఆర్, కర్నూలు
ఎం.ఉపేంద్ర బాబు	సీసీఎస్, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మి	సీసీఎస్, కర్నూలు (అటాచ్డ్ టు సెబ్, కర్నూలు)	వీఆర్, కర్నూలు
ఎం.నాగశేఖర్	సీసీఎస్-3, కర్నూలు	వీఆర్, కర్నూలు
యు.లక్ష్మయ్య	దిశ పీఎస్	వీఆర్, కర్నూలు
కె.కళా వెంకటరమణ	దిశ పీఎస్	వీఆర్, కర్నూలు
కె.శ్రీరాములు	కర్నూలు తాలూకా, యూపీఎస్	వీఆర్, కర్నూలు
కె.ఎర్రిసావలి	వీఆర్ కర్నూలు	మంత్రాలయం సర్కిల్
కుచల శ్రీనివాసులు	మంత్రాలయం సర్కిల్	వీఆర్, కర్నూలు